సామూహిక వరలక్ష్మీ వ్రతం



విజయనగర్‌కాలనీ: శ్రావణమాసం చివరి శుక్ర వారాన్ని పురస్కరించుకుని మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఆసిఫ్‌నగర్ దత్తాత్రేయ కాలనీ, మాసబ్‌ట్యాంక్, విజయనగర్‌కాలనీ శ్యామ్‌నగర్, ఇంద్రానగర్ తదితర ప్రాంతాలతో పాటు బస్తీలు, కాలనీలు తదితర ప్రాంతాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నారాయణరెడ్డి

నాంపల్లి: వినాయక నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నాంపల్లి ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి కోరారు. స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఐ మహేశ్‌తో పాటుగా పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈస్ట్‌జోన్ డీసీపీకి సన్మానం



సుల్తాన్‌బజార్: వినాయక నవరాత్రుల సందర్భంగా కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామిని జైన్ మైనార్టీ కౌన్సిల్ కన్వీనర్ రితేశ్ జాగీర్దార్, జైన్ సేవా సంఘ్ ప్రచార కార్యదర్శి ప్రవీణ్ పాండ్యాల, ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ నర్సయ్య, ఈస్ట్‌జోన్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు సన్మానించారు.

రంగనాథస్వామి ఆలయంలో పూజలు



జియాగూడ: శ్రావణమాస చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని రంగనాథస్వామి ఆలయంలో లక్ష్మీదేవిని సంతాన లక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధి శేషాచారి, ప్రధాన అర్చకులు శ్రీ రంగనాథ భట్టాచార్య, బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి

గోల్కొండ: కాలనీవాసులంతా కలిసికట్టుగా ఉంటేనే సమస్యలు లేని కాలనీగా తీర్చిదిద్దుకోగలుగుతామని షేక్‌పేట్ డివిజన్ డీలక్స్ కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు జునైది అన్నారు. కాలనీలోని వీనస్ హైస్కూల్లో అసోసియేషన్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ మజ్లిస్ నాయకుడు మహ్మద్ ముస్తాఫాకు ఆయన పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు, వీనస్ హైస్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ ఇదాయత్ ఆలీఖాన్ తదితరులు ఉన్నారు.

పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయొద్దని వినతి

చార్మినార్: బహదూర్‌పురా నియోజకవర్గం కిషన్‌బాగ్ డివిజన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీకి ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు. అయితే విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ పనులు నిలిపివేయించాలని ప్రధానోపాధ్యాయురాలు బహదూర్‌పురా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ ను కోరారు. దీంతో ఆయన చార్మినార్ జోన్ డీఈతో పాటు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులైన వచన్ తదితరులను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్ కుమార్ మాట్లాడుతూ.. డీఈ స్పందించి కిషన్‌బాగ్ ఏఈతో మాట్లాడి పనులు నిలిపివేయించారని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్ కలెక్టర్, హైదరాబాద్ డీఈఓ దీనిపైన తక్షణమే విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆదేశించారని తెలిపారు.

గణనాథులకు కేరాఫ్ ధూల్‌పేట్..!

ఫీట్ నుంచి 25 ఫీట్ల ఎత్తు వరకు విగ్రహాల తయారీ

- విభిన్న రూపాల్లో అందుబాటులో వినాయక ప్రతిమలు
- 50 ఏళ్లుగా ఉపాధి పొందుతున్న కళాకారులు
- అప్పుడే మొదలైన విగ్రహాల విక్రయాలు



వేంకటేశ్వర స్వామి రూపంలో..

అబిడ్స్ / జియాగూడ: ధూల్‌పేట్ అంటేనే ఠక్కున గుర్తొచ్చేది గణేశ్ విగ్రహాల తయారీ. నగరంలో పలుచోట్ల వినాయక విగ్రహాలు తయారవుతున్నప్పటికీ ధూల్‌పేట కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకునే విగ్రహాలు మాత్రం ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో మంచి ఆదరణ లభిస్తోంది. గత 50 ఏళ్లుగా ఏటా నవరాత్రులకు 3 నెలల ముందు నుంచే వినాయక విగ్రహాలు తయారీని ప్రారంభిస్తారు.

భారీ విగ్రహాల తయారీ ఇక్కడే

ధూల్‌పేట్‌లో 1–25 ఫీట్ల ఎత్తువరకు విగ్రహాలు అందుబాటులో ఉంచుతారు. ఎప్పటికప్పుడు నూతన పద్ధతిలో తయారు చేయడంతో పాటు తక్కువ ధరల్లోనే విక్రయిస్తుంటారు.



మహావిష్ణు లక్ష్మీదేవి రూపంలో ..

ఇతర దేశాలకు విగ్రహాల తరలింపు

ధూల్‌పేట నుంచి దేశంలోని రాష్ట్రాలతో పాటు విదేశాలకు సైతం విగ్రహాలు తరలిస్తుంటారు. 6 నెలల ముందు నుంచే ఆస్ట్రేలియా, మలేషియా, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఉత్తరప్రదేశ్ నుంచి మండపాల నిర్వాహకులు ధూల్‌పేట్‌కు వచ్చి ఆర్డర్లు ఇచ్చి వెళ్తుంటారు. విగ్రహాలను 15 రోజుల ముందు నుంచే ఆయా ప్రాంతాలకు తీసుకెళ్తుంటారు.

రూ.50 నుంచి రూ.5 లక్షల వరకు

ధూల్‌పేట్‌లో 1–25 ఫీట్ల ఎత్తులో వినాయక విగ్రహాలు తయావుతాయి. 25 అడుగుల గణేశ్ విగ్రహం సుమారు రూ.5 లక్షల వరకు ధర పలుకుతోంది. వీటిని క్రేన్ల ద్వారా లారీల్లో పెట్టించి మండపాలకు తరలిస్తుంటారు. ధూల్‌పేట్‌లో ఏటా సుమారు రూ.25 వేలకు పైగా విగ్రహాలు కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకుంటున్నాయి.



అయ్యప్ప రూపంలో గణనాథుడు

ఇక్కడే తక్కువ ధర



50 ఏళ్లుగా విగ్రహాలు తయారు చేస్తున్నాం. ఈసారి విగ్రహాల తయారీ ముడి సరుకుల ధరలు పెరిగాయి. అయినా ఇతర ప్రాంతాలతో పోల్చితే ఇక్కడే తక్కువ ధరలు ఉన్నాయి. కొన్నిసార్లు విగ్రహాలు మిగిలితే నష్టాలు కూడా వస్తుంటాయి. ప్రభుత్వం రుణాలు ఇస్తే వడ్డీల భారం తప్పుతుంది. ప్రభుత్వం ఇతర రంగాల్లో నష్టాలు వచ్చిన వారికి ఆర్థిక సాయం అందజేసినట్లే ధూల్‌పేట కళాకారులను కూడా ఆదుకోవాలి.

– వికాస్ సింగ్ (ధూల్‌పేట కళాకారుడు)



పులిపై స్వారీ చేస్తూ..

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు



అధికారులకు సూచనలు చేస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

చార్మినార్: గణేశ్ నవరాత్రులకు భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పలు విభాగాల అధికారులతో కలిసి మలక్‌పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, ఫలక్ నుమా, చార్మినార్ సర్కిళ్ల పరిధిలోని సంతోష్ నగర్,ఐ ఎస్ సదన్, మాదన్నపేట్, సైదాబాద్, మలక్ పేట్ ప్రాంతాలతో పాటు శాలిబండ లాల్ దర్వాజా ఛత్రీనాక, కందికల్ గేట్, చాంద్రాయణగుట్ట, బార్కస్, గుర్రం చెరువు, బాలాపూర్ ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. పలు అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్య పనులను అడిగి తెలుసుకున్నారు. గణపతి విగ్రహాలు తరలించే క్రమంలో ప్రధాన రోడ్లపై సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలన్నారు. గణేశ్ ప్రధాన శోభాయాత్ర కొనసాగే బాలాపూర్ నుంచి చాంద్రాయణగుట్ట, కందికల్ గేట్, ఛత్రీనాక, లాల్ దర్వాజా, ఫలక్ నుమా, శాలిబండ చార్మినార్, పత్తార్ గట్టి, మదీనా, నయా పుల్ వరకు ప్రధాన ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, వీధి దీపాల మరమ్మతులు కొనసాగుతున్నాయన్నారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, మలక్‌పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణ గుట్ట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు ఇంకేషఫ్ అలీ, మంగతాయారు, సురేందర్, ప్రాజెక్ట్స్, ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ జి.చంద్రమోహన్

గోల్కొండ: గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ కోరారు. గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్ గార్డెన్‌లో మండపాల నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి మండపాల ఏర్పాట్ల కోసం కొత్త యాప్ అందుబాటులోకి తీసుకువచ్చామని మండపాల ఏర్పాటుకు దీన్ని ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండపానికి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకోవద్దన్నారు. నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర విషయాలను స్థానిక పోలీసులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. అనుమతి పత్రంలో సూచించిన రూట్ మ్యాప్‌లోనే ఊరేగింపు నిర్వహించాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు సయ్యద్ ఫయాజ్, మునావర్, ఇన్‌స్పెక్టర్లు, బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, జొన్నకుంటి మధుసూదన్, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

'కథా కౌముది'పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర ఆజాద్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: రేపటి తరానికి మార్గదర్శకంగా నిలిచే సంకలనం రంజని కథా కౌముది పుస్తకమని ప్రముఖ సాహితీవేత్త చంద్రశేఖర ఆజాద్ అన్నారు. ఏజీ ఆఫీస్ ప్రాంగణంలో రంజని తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో కథా కౌముది పుస్తకావిష్కరణ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దక్షిణామూర్తి, నందివాడ భీమారావు వంటి గొప్ప రచయితలతో పాటు ఈనాటి కథకుల దాక ఎంతోమంది ఈ పుస్తకంలో పాలుపంచుకోవడం సంతోషదాయకమన్నారు. అనంతరం ఏజీ కార్యాలయ సీనియర్ అకౌంట్స్ అధికారి, రంజని అధ్యక్షురాలు నందిరాజు పద్మలత జయరామ్ పదవీవిరమణ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సినీ రచయిత ఆకెళ్ల శివప్రసాద్, ఎ.రాధాకృష్ణ, రంజని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మూసీ పరీవాహక ప్రాంతం పరిశీలన



జియాగూడ: జియాగూడ మూసీ పరీవాహక ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్–13 డిప్యూటీ కమిషనర్ అహ్మద్ సైఫ్‌ఉల్లాహ శుక్రవారం పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అలాగే 100 ఫీట్ల రహదారి మేకల మండి వద్ద అక్రమంగా నిలిపిన లారీలకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. ఆయన వెంట ఏఎంహెచ్‌ఓ, ఏసీపీ అధికారులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నిరసన

చార్మినార్: స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ కు వ్యతిరేకంగా శుక్రవారం మక్కా మసీదు వద్ద నిరసన చేపట్టారు. సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ఎస్ఐఓ ప్రతినిధులు విద్యార్థులు ఒక్కసారిగా బయటికి వచ్చి 'గాజాకు మద్దతుగా ఉందాం.. ఇజ్రాయెల్ కు వ్యతిరేకంగా నినదిద్దాం.. పాలస్తీనాలో ప్రశాంతత ఏర్పడేవరకు మద్దతు తెలుపుదాం.. ఫ్రీ–పాలస్తీనా.. నా డ్రీమ్' అంటూ ప్లకార్డులు పట్టుకుని మక్కా మసీదు నుంచి ప్యారిస్ కేఫ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

24న నృత్య నాటక సౌరభం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 24న రవీంద్రభారతిలో నృత్య నాటక సౌరభం నిర్వహించనున్నట్లు సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజాల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, సినీ నటి జీవిత రాజశేఖర్, గోథే జంత్రం డైరెక్టర్ అనితా దేశాయ్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ భరతనాట్య గురువు డాక్టర్ స్మితా మాధవ్ ఆధ్వర్యంలో నృత్య రూపకం, భూమిక కళాకారులు స్వర్గీయ ఉదయ భాను గరికపాటి రూపకల్పన చేసిన శరణు దాసు జానపద నాటకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

ఏకగ్రీవంగా ఎన్నిక



సొసైటీ సభ్యులుగా ఎల్.మంజిత్ రెడ్డి తదితరులు

అబిడ్స్: రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీని ఎన్నుకున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులుగా కస్తూర్బా గాంధీ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ ఎల్.మంజిత్‌రెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, కె.అనురాధా రెడ్డి, డాక్టర్ రూపారెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శంకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు సొసైటీ ద్వారా అవసరమైన సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు.

టగ్-ఆఫ్-వార్ క్రీడాకారులకు కిట్ల పంపిణీ



క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

గౌలిపురా: మహారాష్ట్రలో ఈనెల 22 నుంచి 25 జాతీయ టగ్–ఆఫ్–వార్ పోటీలు నిర్వహించనున్నారు. దీంతో తెలంగాణ టగ్–ఆఫ్–వార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గౌలిపురా ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి కిట్లు పంపిణీ చేశారు. 27వ సబ్–జూనియర్ బాలురు, బాలికలు, 38వ జూనియర్ బాలికలు, 38వ సీనియర్ మహిళల పోటీలు జరగున్నాయి. రాష్ట్ర టగ్–ఆఫ్–వార్ ప్రధాన కార్యదర్శి ఎం.బ్రహ్మానందం అధ్యక్షతన వహించారు. కార్యక్రమంలో టగ్–ఆఫ్–వార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆదర్ల మహేశ్. కోచ్‌లు బి.సాయి కుమార్, రాఘవేంద్ర, నవీన్, ఎ.భానుప్రకాశ్, గ్రౌండ్ ఇన్‌చార్జి, టీమ్ మేనేజర్ కె.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌ఏఎఫ్‌ఏయూలో బోనాల సందడి



విజయనగర్‌కాలనీ: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో ఆదివారం బోనాల వేడుకలు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల మధ్య ప్రాంగణంలోని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.గంగాధర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోమటిరెడ్డి మహిపాల్‌రెడ్డి, కాలేజ్ ఆఫ్ ఫైనార్ట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంఎల్ ఆనంద్‌రావు, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ గణేశ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.విష్ణువర్ధన్, జి.సంతోష్‌రెడ్డి, ఎస్.అశోక్‌కుమార్, షేక్ అక్బర్, బి.రమేశ్, జి.అరుణ్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, జి.నరేందర్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు'



అరెస్టు అయిన అనంతకృష్ణ తదితరులు

చాంద్రాయణగుట్ట: అధికారుల నిర్లక్ష్యం వల్లే నగరంలో వినాయక ప్రతిమలకు సంబంధించి ప్రమాదాలు జరుగుతున్నాయని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల పండరీనాథ్ అన్నారు. భాగ్యనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ ఆధ్వర్యంలో సచివాలయం వద్ద చేపట్టిన నిరసనకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాతబస్తీలో విద్యుత్ తీగలు పిట్టగూళ్లను తలపిస్తున్నాయన్నారు. ఈ కోవలోనే చాంద్రాయణగుట్ట బండ్లగూడలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు చనిపోయారన్నారు. ఎస్టీ మోర్చా అధ్యక్షుడు గోపీ నాయక్, రవి, లక్ష్మణ్, రంజిత్, సాయి ప్రసాద్ ఉన్నారు.

'సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం'



నిరసనలో నాయకులు

జియాగూడ: అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నగరంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని బీజేవైఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పడాల అనంతకృష్ణ ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు పార్టీ ఆదేశానుసారం చలో సెక్రటరియేట్ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొనగా పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం అణగదొక్కుతుందని మండిపడ్డారు.

మాజీ ఎమ్మెల్యే హౌస్ అరెస్ట్

అబిడ్స్: సచివాలయం ముట్టడికి బీజేపీ పిలుపునివ్వడంతో అవంతినగర్‌లో గోషామహల్ మాజీ ఎమ్మెల్యే ప్రేంసింగ్ రాథోడ్‌ను అడిషనల్ డీసీపీ బి.ఆనంద్ ఆధ్వర్యంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ప్రేంసింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



జలమండలి అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ కోరారు. జలమండలి డివిజన్–2 జనరల్ మేనేజర్ శ్యాంసుందర్ నాయక్‌తో తన కార్యాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ.. తలాబ్ చంచలం, రెయిన్ బజార్, సంతోస్‌నగర్, కుర్మగూడ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి, సీవరేజ్ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని వాటి వల్ల ప్రజలకు ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నూతనంగా ప్రతిపాదించిన పనులను సైతం వెంటనే ప్రారంభించాలని కోరారు. ఆయనతో పాటు స్థానిక మజ్లిస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పఠనశక్తితో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీత



మాట్లాడుతున్న హెచ్‌ఎం హరి నారాయణ

గౌలిపురా: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేది పఠనశక్తి అని శాలిబండ ప్రభుత్వోన్నత బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరి నారాయణ అన్నారు. స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) డాక్టర్ ఎస్.విజయభాస్కర్ ఆధ్వర్యంలో 'నా పుస్తకం.. నా కథ' అనే నినాదంతో రీడింగ్ క్యాంపెయిన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పఠన శక్తి ద్వారా కథలు, నవలలు, కవితలు, పద్యాలు, దేశ నాయకుల చరిత్ర తెలుస్తుందన్నారు. విజయ భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, రూమ్ టూ రీడ్ ఇండియా ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సెప్టెంబర్ 8 వరకు క్యాంపెయిన్ కొనసాగిస్తామన్నారు. చదవడం, చదివింది అర్థం చేసుకోవడం, అర్థం చేసుకున్నది వ్యక్తీకరించడంతో విద్యార్థుల్లో అభ్యాసన ఫలితాలు సాధించడం సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో సంధ్య, అంజలి, మధుసూదన్ రావు, మంజుల, శ్రీదేవి, ప్రమీల, పాఠశాల సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్లు అనిల్ కుమార్, సుదేష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలని ఆందోళన



విద్యార్థులతో కలిసి బైఠాయించిన ఆర్.కృష్ణయ్య, ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

నాంపల్లి: ఫీజు బకాయిలు చెల్లించాలని, బీసీ, ఈబీసీ విద్యార్థుల పూర్తి ఫీజు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు విద్యార్థులు మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీఆర్ఎస్ సీనియర్ నేత, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అక్కడికి చేరుకుని విద్యార్థులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ పథకానికి రూ.6 వేల కోట్ల అప్పు తెస్తే తప్పేం లేదన్నారు. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపకార వేతనాలను సక్రమంగా అందించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడుతుందన్నారు. ట్రస్ట్ బ్యాంక్ ఏర్పాటు చేసి దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామని కొత్త నాటకానికి తెర లేపారని, ఈ ప్రతిపాదనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. ఫీజు చెల్లించని కారణంగా కళాశాలల యాజమాన్యాలు కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని వాపోయారు.

ఆత్మీయ సమ్మేళనానికి రండి



మహేశ్ సింగ్‌కు ఆహ్వాన పత్రం ఇస్తున్న కమల్‌వీరేశ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు నర్సింగ్

అబిడ్స్: విశ్వహిందూ పరిషత్, సామాజిక సమరసత అభియాన్ ఆధ్వర్యంలో జియాగూడలోని శ్రీ సమర్థ రామధేను గోశాలలో ఈనెల 24న కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సామాజిక సమరసత ప్రాంత సహ ప్రముఖ్ కమల్ వీరేశ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు నర్సింగ్ పేర్కొన్నారు. ఈమేరకు కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ లోధ్ క్షత్రీయ సదర్ పంచాయతీ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌సింగ్‌ను శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీహెచ్‌పీ అఖిల భారతీయ కార్యదర్శి దేవ్‌జీ రావత్, రాష్ట్ర అధ్యక్షుడు భోజనపల్లి నరసింహమూర్తి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సాధు పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ స్వామిజీ, శ్రీ సమర్థ కామధేను గోశాల నిర్వాహకుడు ప్రభుదత్ మహారాజ్ కూడా పాల్గొంటారని తెలిపారు. సమావేశానికి అన్ని కుల సంఘాలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.